ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
3★★★
సోమవారం 9 సెప్టెంబరు 2024

బహుభాషా కృషీవలుడు 'నలిమెల' 5
- కాళోజీ పురస్కారానికి ఎంపిక

6 బ్రిడ్జి కూల్చారు..
నిర్మాణం మరిచారు


చందుర్తిలో కొలువుదీరిన గణనాథుడు


శాంతినగర్ ఏక్‌నాథ్ మండపంలో..


బీవైనగర్‌లో..


మహవీర్ మండపంలో..


థండర్ రాక్స్ యూత్ ఆధ్వర్యంలో బాల గణపతి


శివసేన ఆధ్వర్యంలో..

కొలువుదీరిన గణనాథుడు

- ఊరురా భారీ విగ్రహాలతో సందడి
- జిల్లా వ్యాప్తంగా ఉత్సవాలు
- 5 వేలకు పైగా విగ్రహాల ప్రతిష్ఠ
- రూ.15 కోట్ల పైనే ఖర్చు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

బొజ్జ గణపయ్య ఊరురా, వాడవాడనా విభిన్న ఆకృతులు అలంకరణల మధ్య కొలువు దీరాడు. శనివారం వినాయక చవితి పర్వదినాన్ని జిల్లా కేంద్రంతోపాటు వేములవాడ, సిరిసిల్ల, ముస్తాబాద్, గంబీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, బోయినపల్లి, చందుర్తి, రుద్రంగి, వేములవాడ రూరల్, వేములవాడ అర్బన్, కోనరావుపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో భక్తి శ్రద్ధల మధ్య వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. వినాయక విగ్రహాలు విభిన్న రూపాల్లోఉండగా పకృతి ప్రేమికులు భారీ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో లేబర్ అడ్డా, బీవై నగర్, అశోక్‌నగర్, అంబేద్కర్‌నగర్, బోయవాడ, విద్యానగర్ చౌరస్తా, గోపాల్‌నగర్, సుభాష్‌నగర్, గాంధీనగర్, సుందరయ్యనగర్, ఆటో నగర్, శాంతినగర్, వెంకంపేట, సర్దార్‌నగర్, ప్రగతినగర్, మెహెర్‌నగర్, జేపీనగర్, రెడ్డివాడ, సిద్ధార్థనగర్, సంజీవయ్యనగర్, భావనారుషినగర్ తదితర ప్రాంతాల్లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు.


ఛత్రసేన యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడు

● భారీ సెట్టింగ్‌ల ఏర్పాటు

జిల్లాలో విభిన్నమైన ఆకారాల్లో ఉన్న విగ్రహాలే కాకుండా భారీ సెట్టింగ్‌లను వేశారు. మండపాలు చూడ ముచ్చటగా తీర్చిదిద్దారు. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా కనిపిస్తున్నాయి. నవరాత్రుల్లో ఉత్సవాలను చూడడానికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, ప్రసాదాల పంపిణీ ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఉత్సవాల చందాలు రాసే వారికి లక్కీ డిప్ ద్వారా బహుమతులను అందజేయనున్నారు.

● దాండియాకు ఏర్పాట్లు

జిల్లాలోని మండపాల వద్ద వినాయకుడిని భక్తితో కొలుస్తూ మహిళలు దాండియా సందడి చేయనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు డీజే సౌండ్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

● మార్కెట్‌లో విగ్రహాల కొనుగోళ్ల సందడి...

వినాయక చవితి సందర్భంగా జిల్లా కేంద్రంలోని రైతుబజార్, మార్కెట్‌లలో ప్రత్యేకంగా వెలిసిన వినాయక విక్రయ దుకాణాల వద్ద సందడి కనిపించింది. వినాయక పూజకు సంబందించిన సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్ కిటకిటలాడింది. పూజ, పత్రిల కొనుగోళ్లు చేశారు. ఎంతో భక్తి శ్రద్ధలతో ఇళ్లలో పూజలు నిర్వహించారు.

● రూ.కోట్లలో ఖర్చు

జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో నిర్వాహకులు ఖర్చు పెడుతున్నతీరు కోట్లలోనే కనిపిస్తోంది. కొన్ని చోట్ల విగ్రహాలు రూ.2 లక్షల వరకు ఉండగా మండపం ఏర్పాటుకు మరో రూ.2 నుంచి 3 లక్షల వరకు ఖర్చు చేశారు. జిల్లాలో 5 వేల ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు అంచనాలు వేశారు. ఉత్సవాల్లో కనీసం రూ.10 నుంచి 15 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. వినాయక విగ్రహాల వద్ద ఏర్పాటు చేసే లడ్డూ వేలం కూడా భారీగానే సాగనుంది.


గీతానగర్, విద్యానగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో


సుభాష్‌నగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో


శ్రీ గణేష్ యువమిత్ర సంఘం ఆధ్వర్యంలో..


పురజన సంఘం ఆధ్వర్యంలో..


హిందూ సేవక్ సమితి ఆధ్వర్యంలో


వేములవాడలో అశ్వవాహనంపై..

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

తంగళ్లపల్లి, సెప్టెంబరు 8: తంగళ్లపల్లి మండేపల్లి ఐటీఐ కళాశాలలో నాలుగో దశ ప్రవేశాల కోసం ఈ నెల 5వ తేదీ నుంచి 20వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు ఆప్షన్ పెట్టుకుంటే సరిపోతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు 11వ తేదీన ఒర్జినల్ సర్టిఫికెట్స్‌తో ఆప్షన్ పెట్టుకున్న కళాశాలకు హాజరుకావాలని సూచించారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

పవర్‌లూం కార్మికుల సంతకాల సేకరణ

తంగళ్లపల్లి, సెప్టెంబరు 8: పవర్‌లూం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో తంగళ్లపల్లిలో సంతకాల సేకరణ చేపట్టారు. సీఐటీయూ నాయకుడు కోడం రమణ మాట్లడుతూ పవర్‌లూం, అనుబంధ కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టినట్లు, సీఎం వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.

సిరిసిల్లలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 8:సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ఆదివారం తెలంగాణ ఆల్ సీనియర్ సీటిజన్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ప్రధానకార్యదర్శి డాక్టర్ జనపాల శంకరయ్య, గుడ్ల శ్రీధర్, ఇరుకుల్ల భాస్కర్, కట్టెకోల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి


మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 8: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఆలయ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాజన్న భక్తులకు వేగంగా దర్శనం కల్పించేందుకు, మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆహ్లాదకర వాతావరణం, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ విస్తరణ చేపట్టనున్నట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి రూ. 50 కోట్లు మంజూరు చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయ విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. త్వరలోనే ఆలయ విస్తరణపై శృంగేరి పీఠాధిపతి ఉత్తరాధికారి విదుశేఖర భారతి స్వామిని కలవనున్నట్లు, సూచన, సలహాల ప్రకారం ఆగమ శాస్త్రాన్ని అనుసరించి విస్తరణ చేపట్టనున్నట్లు చెప్పారు.

జీవో నంబరు 149 రద్దుపై చర్చ

రాజన్న ఆలయ పరిసరాల్లో గత ప్రభుత్వ హయాంలో కిలో మీటర్ పరిధిలో చేపట్టబోయే నిర్మాణాలపై ఇచ్చిన జీవో నంబరు 149 రద్దుపై చర్చించారు. జీవో ద్వారా ఆలయ పరిధిలో అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. జీవో రద్దు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. డీఈ రఘునందన్, ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, రమేష్‌బాబు, ఇన్‌చార్జి స్థానాచార్యులు ఉమేశ్‌శర్మ, ప్రధాన అర్చకుడు సురేష్, ఉప ప్రధాన అర్చకుడు శరత్ తదితరులు ఉన్నారు.

మిడ్‌మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 8: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి 11,450, ములవాగు, మానేరు వాగు ద్వారా 1105 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ఎల్ఎండీ ప్రాజెక్టుకు 7 గేట్ల ద్వారా 19 వేల 900, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 316.50 మీటర్లు, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 23.814 టీఎంసీల మేర నీరు చేరుకుంది.

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 397మీటర్లకు ప్రస్తుతం 394.61 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 3.5టీఎంసీలకు 2.85 టీఎంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా 6400 క్యూసెక్కుల నీరు వస్తుండగా రెండు పంపులద్వారా ఎత్తిపోస్తున్నారు. ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు,
ఆది శ్రీనివాస్‌కు రాజన్న ప్రసాదం అందజేస్తున్న నర్సయ్య

రాజన్న ఆలయంలో గణపయ్యకు ప్రత్యేక పూజలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 8: వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో గణనాథుడు కొలువుదీరాడు. రాజన్న ఆలయ అర్చకులు మంత్రోచ్చరణల మధ్య శనివారం ఆలయ నాగిరెడ్డి మండపంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పార్వతిపరమేశ్వరులను, నాగిరెడ్డి మండపంలోని వినాయకుడిని దర్శించుకున్నారు.

వినాయక చవితి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా విడివిడిగా దర్శించుకున్నారు. ఆలయ పండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయాధికారులు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం నాగిరెడ్డి మండలంలో ఏర్పాటు చేసిన గణేష్ వద్ద ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పూజలు చేశారు.

రాజన్న అన్నదాన ట్రస్టుకు రూ. 4.50 లక్షల విరాళం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఉచితంగా అన్నదానం ప్రసాదం కల్పించేందుకు వేములవాడకు చెందిన గోలి తిరుపతి- కవిత దంపతులు అన్నదాన ట్రస్ట్ కోసం రూ. 4 లక్షల 50 వేలు ఆలయ ప్రోటోకాల్ అధికారి ఎడ్ల శివసాయికి అందజేశారు. అన్నదాన ట్రస్ట్‌కు విరాళం అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ బింగి మహేష్, కూరగాయాల కొమురయ్య, సంఘ స్వామి యాదవ్, వరి నర్సయ్య చిలుక రమేష్, సాగరం వెంకటస్వామి తదితరులు ఉన్నారు.


రాజన్న దర్శనానికి వస్తున్న కలెక్టర్

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

హుజూరాబాద్, సెప్టెంబరు 8: జల్సాలకు అలవాటు పడ్డ ఇద్దరు యువకులు గంజాయిని తరలిస్తుండగా శనివారం పోలీసులు పట్టుకున్నారు. స్థానికంగా ఏసీపీ శ్రీనివాస్‌జీ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని మలంన్‌గిరి జిల్లాకు చెందిన తనుగుల అర్జున్, సుభాష్‌సీసా అనే ఇద్దరు వ్యక్తులు ఇంటర్మీడియట్ మధ్యలోనే ఆపేశారు. ఐదేళ్లుగా గంజాయి పండిస్తూ అక్కడే విక్రయించేవారు. బయట రాష్ట్రాల్లో అమ్మితే ఎక్కువగా డబ్బులు వస్తాయనే భావించారు. గంజాయిని వరంగల్ నుంచి తీసుకొని వస్తుండగా, హుజూరాబాద్ బస్టాండ్ సమీపంలో టౌన్ సీఐ తిరుమల్ గౌడ్, ఎస్‌ఐ యూసఫ్ మహ్మద్ అలీలు తనిఖీ చేశారు. వారి వద్ద 20కిలోల గంజాయి లభించింది. దీంతో ఇద్దరిని అదుప ులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.. ఈ గంజాయి విలువ రూ. 5లక్షల వరకు ఉంటుందని తెలిపారు. రెండు నెలల క్రితమే 60మంది యువకులకు గంజాయిపై కౌన్సెలింగ్ ఇచ్చావన్నారు. గంజాయి మత్తులో పడి యువకులు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఏసీపీ సూచించారు.



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 8: పెద్దపల్లి ఎల్లమ్మ చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని రంగంపల్లికి చెందిన ఆరేపెల్లి జంపయ్య(33) కలెక్టర్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ క్లర్క్‌గా పని చేస్తున్నాడు. మూడు నెలలుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. తిరిగి రాకపోవడంతో జంపయ్య అన్న రాజేష్ పోలీస్‌స్టేష న్లో ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం ఎల్లమ్మ చెరువులో శవమై కన్పించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య సంధ్య, పిల్లలు మన్విత, జశ్వంత్ ఉన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

చొప్పదండి, సెప్టెంబరు 8: పట్టణానికి చెందిన పూదరి లక్ష్మయ్య(50) ఈత చెట్టు పై నుంచి పడడంతో తీవ్ర గాయలయ్యాయి. లక్ష్మయ్య ఆదివారం కల్లు తీయడానికి ఈత చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారీ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మయ్యను కరీంనగర్‌లోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని గృహిణి ఆత్మహత్య

- ఏడేళ్ల కూతురు ముందే ఘటన

కోల్‌సిటీ, సెప్టెంబరు 8: ఏడేళ్ళ కూతురు ముందే ఓ గృహిణి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం గోదావరిఖని విఠల్‌నగర్‌లో చోటు చేసుకున్నది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు. సుల్తానాబాద్ మండలం మూలసాల గ్రామానికి చెందిన చొప్పరి అంజయ్య తన భార్య మాధవి(28), ఏడేళ్ల కూతురు రితికతో కలిసి గోదావరిఖని విఠల్‌నగర్‌లో నివాసముటున్నారు. అంజయ్య సెంట్రింగ్ లేబర్‌గా పని చేస్తున్నాడు. అంజయ్య కుటుంబానికి ఎండీ యూసుఫ్ అనే వ్యక్తి కుటుంబానికి కొన్నేళ్లుగా దగ్గరి పరిచయం ఉంది. శనివారం అంజయ్య భార్య మాధవి యూసుఫ్‌కు వీడియో కాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురు ఏడేళ్ల రితిక ముందే అఘాయిత్యం చేసుకుంది. కాగా ఘటన వివరాలను మాధవి కూతురు రితిక కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలిపింది. తన భార్య మరణం పట్ల యూసుఫ్‌పై అనుమానం ఉందని అంజయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

గరకపై గణపతి విగ్రహం

- సూక్ష్మకళాకారుడి అద్భుత ప్రతిభ

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 8:వినాయక నవరాత్రుల సందర్భంగా గరకపై వినాయక విగ్రహం చెక్కి అందరినీ అబ్బురపరిచాడు పట్టణానికి చెందిన సూక్ష్మకళాకారుడు గుర్రం దయాకర్. గణేషుడికి ఇష్టమైన గరకపై సూక్ష్మగణనాథుడిని తయారుచేశాడు. విగ్రహం తయారు చేయడానికి సుమారు 10గంటల సమయం పట్టిందని దయాకర్ తెలిపారు.


గరకపై గణనాథుడి చిత్రీకరణ

శాంతి కోసమే సాహిత్యం

- పంపాతీరం పుస్తక పరిచయసభలో రచయిత్రి ఓల్గా

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8: వివక్షలు, అణచివేతలు, హింసలేని శాంతియుత జీవితాల కోసమే సాహిత్యాన్ని సృజిస్తు న్నానని రచయిత్రి ఓల్గా స్పష్టం చేశారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో ఆదివారం జరిగిన పంపాతీరం పుస్తక పరిచయ సభలో ఆమె మాట్లాడారు. దేశంలో పెరుగుతున్న హింస, ఆదివాసీలు, దళితులపై జరుగుతున్న దాడులకు చలించి పంపాతీరం నవల రాశానని అన్నారు. కందుకూరి అంజయ్య, తోట నిర్మలారాణి పుస్తక పరిచయం చేయగా పుప్పాల శ్రీరాం ఓల్గా ఐదు దశాబ్దాల సాహిత్య ప్రస్థానాన్ని వివరించారు. పురాణేతిహాసాల పాత్రలను వర్తమానానికి అన్వయిస్తూ అద్భుత సాహిత్యాన్ని ఓల్గా సృష్టిస్తున్నారని కథా రచయిత డాక్టర్ బీవీఎన్ స్వామి అన్నారు. ఇటీవల మరణించిన సాహితీ వేత్తలు డాక్టర్ కె ముత్యం, బండారు అంకయ్య, వడ్డేపల్లి కృష్ణలకు సంతాపం ప్రకటించారు. సాహితీవేత్తలు అన్నవరం దేవేందర్, బూర్ల వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఓల్గాను సన్మానించారు. తెరవే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గాజోజు నాగభూషణం, దామెర లక్ష్మి, కె నాగమణి, పెనుగొండ సరసిజ, సిరిపురం వాణిశ్రీ, దామరకుంట శంకరయ్య, పిఎస్ రవీంద్ర, నడిమెట్ల రామయ్య, కనకం శ్రీనివాస్, నామని సుజనాదేవి, విలాసాగరం రవీందర్, గీతారెడ్డి పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న కవులు, రచయితలు

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	1,05,000	1,26,865	80.5	80.053
ఎల్లంపల్లి	80,232	95,256	20.175	19.202
మిడ్ మానేరు	13.394	26,450	27.54	23.509
ఎల్ఎండీ	34,355	1,297	24.034	21.464

దసరా సెలవుల్లోనే పదోన్నతులు


మాట్లాడుతున్న రఘోత్తంరెడ్డి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 8: దసరా సెలవుల్లోనే జీవో నంబరు 11, 12లను సవరించి 6,500 ప్రాథమిక పాఠశాలలకు హెడ్మాస్టర్ల పోస్టులను సృష్టించి, అర్హత కలిగిన సీనియర ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా అవకాశం కల్పించే విధంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్‌లో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్నాథ్ రెడ్డి అధ్యక్షతన జిల్లా శాఖ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ పీఎస్ హెడ్‌మాస్టర్ల పోస్టుల మంజూరుతో బీఎడ్ ఎస్జీటీలకు న్యాయం చేస్తామన్నారు. సీపీఎస్ రద్దు విషయాన్ని ఇప్పటికే సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లామని, స్పందించిన సీఎం సీపీఎస్‌ను రద్దు చేస్తామని పీఆర్టీయూ సంఘానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, దామెదర్‌రెడ్డి, మహేంధర్‌రెడ్డి, కమలాకర్‌రావు, గాయత్రిదేవి, జమునదేవి, సురేఖ, రాజు,చిన్నయ్య, రాజశేఖర్, సత్యనారాయణ, చంద్రప్రకాష్, రవికుమార్ తదితరులున్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 8: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ 6వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 27న సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని చేపట్టిన చైతన్య యాత్ర ఆదివారం తెలంగాణ చౌక్ చేరుకుంది. ఈసందర్భంగా శ్రీనివాస్‌కు జిల్లా ఉద్యమకారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా అమరవీరుల స్థూపం వరకు వెళ్లి అమరవీరులకు నివాళులర్పించారు. ఈనెల 27న ఉద్యమకారుల సన్మానసభను నిర్వహిస్తున్నామని, తెలిపారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సన్మాన సభ గోడపోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామి, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఓరుగంటి ఆనంద్, కూల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జిఎస్ ఆనంద్, టీయుఎఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఐలీ ప్రసన్న, రాష్ట్ర నాయకులు, జోజిరెడ్డి, సంజివరెడ్డి, నాయకులు చొప్పరి సుధాకర్, బీజేపీ నాయకురాలు వరాల జ్యోతి, బోగెపద్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్‌లో గోదావరిఖనికి చెందిన

మహిళా జవాను ఆత్మహత్య


గంగాభవాని(ఫైల్)

జ్యోతినగర్, సెప్టెంబరు 8: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన మహిళా బీఎస్ఎఫ్ జవాను బల్ల గంగా భవాని (26) గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గాంధీనగర్ దంతివాడలో గేట్ డ్యూటీ నిర్వహిస్తున్న గంగా భవాని శనివారం విధులకు హాజరుకాలేదు. బీఎస్ఎఫ్ అధికారులు ఆమె నివసిస్తున్న క్వార్టర్ వద్దకు వచ్చి చూడగా ఉరివేసుకుని కనిపించింది. ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదని, పోస్టుమార్టం అనంతరం తెలిసే అవకాశం ఉన్నదని బీఎస్ఎఫ్ అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గంగాభవాని మృతదేహాన్ని ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తీసుకువచ్చిన బీఎస్ఎఫ్ అధికారులు అక్కడి నుంచి ఆదివారం ఎన్టీపీసీలోని స్వగృహానికి అధికారులు చేర్చారు. గంగాభవాని మృతదేహానికి బీఎస్ఎఫ్ జవాన్లు, రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, ఎన్టీపీసీ ఎస్సై సతీష్‌లు నివాళులు అర్పించారు. సైనిక లాంఛనాలతో గోదావరి తీరంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఎన్టీపీసీ సుభాష్‌నగర్‌కు చెందిన బల్ల సుబ్రహ్మణ్యం, సరస్వతిల చిన్న కుమార్తె గంగాభవాని. పదో తరగతి వరకు స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో చదివింది. ఇంటర్‌మీడియెట్ ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో చదివింది. 2021లో గంగాభవాని బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించింది. పశ్చిమ బెంగాల్‌లో విధులు నిర్వహించిన గంగాభవాని ఎనిమిది నెలల క్రితం గాంధీనగర్ దంతివాడకు బదిలీ అయింది. సెలవుపై ఆగస్టు 5వ తేదీ నుంచి ఈనెల 1వ తేదీ వరకు ఎన్టీపీసీకి వచ్చి తల్లిదండ్రుల వద్ద గడిపింది. ఈనెల 2వ తేదీన తిరిగి విధుల్లో చేరింది. కేరళ రాష్ట్రానికి చెందిన ఒక యువకుడితో ఈ ఏడాది డిసెంబరులో వివాహం చేయాలని అనుకున్నామని ఆమె తండ్రి తెలిపారు. కానీ ఇంతలోనే గంగా భవాని ఆత్మహత్యకు పాల్పడడం ఆమె కుటుంబంలో విషాదాన్ని నింపింది.

ఆర్థిక ఇబ్బందులతో ఆర్కిటెక్చర్ ఆత్మహత్య


కమలాకర్(ఫైల్)

కోరుట్ల, సెప్టెంబరు 8: పట్టణంలోని తిలక్ రోడ్డు ప్రాతానికి చెందిన గుంటుక కమలాకర్ (45) అనే అర్కిటెక్చర్ ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కమలాకర్ కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో ఆర్కిటెక్చర్‌గా పని చేస్తూ బిల్డింగ్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. గణపతి నవరాత్రి ఉత్సవాలు పాల్గొవడానికి రెండు రోజుల క్రితం కోరుట్ల పట్టణానికి చేరుకున్నాడు. కమలాకర్ ఆదివారం ఉదయం పట్టణంలోని తాళ్ల చెరువు ప్రాంతంలోని గంగమ్మ దేవాలయ ఆవరణలో ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు పాల్పడే ముందు ఫోన్ ద్వారా అతడు ఉన్న లోకేషన్‌ను హైదరాబాదులోని మిత్రులకు పంపించాడు.. వెంటనే అక్కడి మిత్రులు కోరుట్లలో ఉన్న మిత్రులకు సమాచారం అందించారు. అక్కడి వెళ్లి చూడగా అప్పటికే కమలాకర్ ఆత్మహత్య చేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చనిపోతున్నట్లు కమలాకర్ తన ఫోన్ ద్వార మిత్రులకు, బంధువులకు మెసెజ్ చేసి ఆత్మహత్య పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కమాలాకర్‌కు బార్య జయశ్రీ, కూతురు సిద్ధి, కొడుకు ఓంకార్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి

కోరుట్ల, సెప్టెంబరు 8: కోరుట్ల పట్టణంలోని ఝాన్సి రోడ్డులో ఓ భవన నిర్మాణ పనుల వద్ద కూలి పని చేస్తున్న మహారాష్ట్రకు చెందిన వలస కార్మికుడు ఇస్మాయిల్ (39) విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఝాన్సీ రోడ్డులో నూతన భవన నిర్మాణం కోసం ఏర్పాటు చైసిన పిల్లర్ గుంత వర్షం నీటితో నిండి పోయింది. నీటిని తీయడానికి ఇంటి కాంట్రాక్టర్, యజమాని విద్యుత్ మోటర్‌ను ఏర్పాటు చేసి నీటిని తోడుతున్నారు. గుంత సమీపంలో పని చేస్తున్న ఇస్మాయిల్‌కు విద్యుత్ షాక్ తగలడంతో ఇస్మాయిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇస్మాయిల్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృత దేహం అందించినట్లు పోలీసులు తెలిపారు.

బహుభాషా కృషీవలుడు 'నలిమెల'

- తెలంగాణ బతుకు తండ్లాటకు అక్షర రూపం
- తెలంగాణ సాహిత్య సంస్కృతి, ఉనికి కోసం ఆరాటం
- సోదర బాష సాహిత్యాల మిత్రుడిగా గుర్తింపు
- తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కాళోజీ పురస్కారానికి ఎంపిక
- జిల్లా రచయితలు, కవుల అభినందనలు


డాక్టర్ నలిమెల భాస్కర్

సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8: బహుభాషా కృషీవలుడు డాక్టర్ నలిమెల భాస్కర్. కవిగా, రచయితగా, అనువాదకుడిగా, విశ్రాంత ఉపన్యాసకుడిగా ఆయనకు ఎంతో పేరు ఉంది. తెలంగాణ సాహిత్య సంస్కృతి ఉనికిని కాపాడే దిశగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తనదైన పాత్రపోషించారు. 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిష్ఠాత్మక కాళోజీ నారాయణరావు పురస్కారానికి ఎంపికయ్యారు. పురస్కారంతోపాటు రూ.1.01.116 అందించనున్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో బుచ్చమ్మ, రామచంద్రం దంపతులకు భాస్కర్ జన్మించారు. అధ్యాపకుడిగా, సాహిత్య రంగంలో ఎనలేని కృషి చేస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో స్థిరపడ్డారు. తెలుగు, కన్నడ, తమిళ, మళయాల సామెతలపై ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఫిల్, తెలుగు, మలయాళ కుటుంబ సామెతలపై పరిశోధన చేసి ఉస్మానియా నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను పొందారు. తెలుగు అధ్యపకుడిగా 2011లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 2013 సంవత్సరానికి అనువాద రంగంలో మళయాలం నుంచి స్మారక శశిగల్ నవలను స్మారక శిలలు పేరిట అనువదించి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తరువాత కరీంనగర్ రచయితల్లో రెండోవాడిగా భాస్కర్ నిలిచారు. నలిమెల భాస్కర్ కాళోజీ పురస్కారానికి ఎంపికవడంపై తెలంగాణ రచయితల వేదిక, మానేరు రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.

పలు భాషలపై పట్టు..

మలయాళం, హిందీ, తమిళం, ఉర్దూ, కన్నడ, మరాఠీ, బెంగాలీ, పంజాబీ, సంస్కృతం, ఒరియా, అస్సామీ, గుజరాతీ, ఇంగ్లీష్, తెలుగు భాషలను అవపోసన పట్టిన నలిమెల భాస్కర్ అనువాద రంగంలో కృషి చేస్తూనే తెలంగాణ ఉద్యమంలో యాస, భాషలను పదిలపరుస్తూ పద కోశాలను అందించారు. 2003లో తెలంగాణ పదకోశాన్నిఅందించడంతో పాటు అదే క్రమంలో 2008లో తెలంగాణ భాష వ్యాసాలు, 2017లో తెలంగాణ భాష దేశీయపదాలు, 2019 తెలంగాణ భాష సంస్కృత పదాలు, 2020లో తెలంగాణ భాష తమిళ పదాలు, 2021లో తెలంగాణ భాష క్రియ పదాలు, సంకలనాలను వెలువరిచారు. తెలంగాణ భాష, యాసపై సాహిత్య రంగంలోనే ప్రత్యేక చర్చకు ఊపిరి పోశారు. ఇతర భాషల నుంచి ఎన్నో కథలను అనువదిస్తూ సంకలనాలను వెలువరిచారు. 1993లో నూరేళ్ల పది ఉత్తమ మళయాల కథల సంకలనాన్ని తెచ్చారు. 1996లో కన్నడం, తమిళం, మళయాలం, హిందీ, మరాఠీ, బెంగాలీ భాషల నుంచి అనువదించిన కథలను అద్దంలో గాంధారి పేరుతో సంకలనంగా అందించారు. మన సాహిత్య అభిమానులకు యూరోపియన్, రష్యన్, అమెరికన్, ఆఫ్రికన్ సాహితీవేత్తలు ఎంత ఎక్కువ తెలుసో పొరుగున ఉన్న ఇతర భాషాకారుల గురించి తక్కువగా తెలుసు ఈ నేపథ్యంలో భాస్కర్ ఇతర భాషలకు అనుసంధానంగా వారధిగా నిలిచారు. 1998-99లో 35 వారాలపాటు ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో సాహితీ సుమాల పేరుతో 17వ శతాబ్దానికి చెందిన ఉర్దూ కవి మీర్ నుంచి 20వ శతాబ్దం చివరి వరకు అంకురించి ఆకస్మికంగా మాయమైన కొండ జాతి అక్షరం చూచీ దాకా పరిచయం చేశారు. దీంతోపాటు 1994లో మళయాలం నుంచి మోహన వర్మ మనీ మేకర్స్‌ను ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో బిజినెస్ పత్రికలో సీరియల్‌గా వచ్చింది. కన్నడం నుంచి కుండీ నవల, బెంగాల్ నుంచి అవసానం, జైన్ సాహిత్యాన్ని తెలుగులోకి తెచ్చారు.

● తొమ్మిదో తరగతి నుంచే..

తెలంగాణ ఉద్యమంలో డాక్టర్ నలిమెల భాస్కర్ తనదైన శైలిలో సాహిత్యం వైపు అడుగులు వేశారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని శ్రీరామ చంద్రదారుల గ్రంథాలయానికి వెళ్లి వంద లాది డిటెక్టివ్ నవలను చదివారు. ఆ ప్రభావంతోనే 9వ తరగతిలోనే కాలు కదిపావో కాల్చేస్తా డిటెక్టివ్ నవలను రాశారు. పదో తరగతిలో ఒక పాటను రాశారు. ఆ తర్వాత కామారెడ్డిలో ఇంటర్మీడియెట్ చదివే సమయంలో పుస్తకాలతో దోస్తీ చేశారు. నిజామాబాద్‌లో అగ్నివీణ పత్రికలో త్రివర్ణ పతాక అనే పద్యం అచ్చయ్యింది. 1973-74లో మూడు సాంఘీక నవలలు రాశారు. 1974 డిగ్రీలో 'నా మానవుడా' గేయ సంపుటి పుస్తకాన్ని రాశారు. 1976-77లో బీఈడీ చదువుతున్న సమయంలో భాస్కరోక్తులు ప్రచురించారు. 1977లో మంద పేరుతో రాసిన కథ అప్పటి సామాజిక రుగ్మతల నేపథ్యంలో చర్చకు దారి తీసింది. 1978లో ఈ తరం పాటలు, 2000లో సాహితీ సుమాలు సంకలనం, అదే సంవత్సరం తమిళంలోకి తమిళ్ తొట్టక్కల్ తెలుంగు కుయిల్ గళ్ కవిత్వాన్ని అనువదించారు. 2008, 2024లో సుద్దముక్క కవిత్వం, 2010లో భారతీయ సాహిత్య వ్యాసాలు, 2010లో భారతీయ సామెతలు, 2010లో భారతీయ కథలు, దేశ దేశాల కవిత్వం, స్మారక శిలలు, 2016లో నానీ కవి ధైగల్ 2021లో సముద్ర శాస్త్రజ్ఞురాలు, చలన చలనం, ఇక్కడి నేల, 2022లో ద్రౌపతి మళయాళ అనువాద పరిశోధన, జీవ ద్రైవ్యం కవిత్వాన్ని అందించారు. భాస్కర్ సంపాదకత్వంలో బసవ పురాణ పదకోశాన్ని వెలువరిచారు.

ఎన్నో పురస్కారాలు

బహుభాష కోవిదుడిగా, అనువాదకుడిగా తెలంగాణ నుంచి ముందు వరుసలో నిలిచిన డాక్టర్ నలిమెల భాస్కర్ మళయాలంలో అనువాద నవల స్మారక శిలలకు 2013 కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. 2014లో తెలుగు యూనివర్సింటీ డాక్టర్ బోయి భీమన్న అనువాద పురస్కారం, 1974లో తెలుగు యూనవర్సింటీ పురస్కారం, 1998లో కళాసాగర్ సిరిసిల్ల పురస్కారం, 1999లో కళాజ్యోతి పురస్కారం 2000లో కవిసమయం పురస్కారం, 2001లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2001 బీఎన్ శాస్త్రి పురస్కారం, 2003లో సిరి వెలుగుల పురస్కారం, 2006లో అధికార భాష సంఘం పురస్కారం, 2008లో ద్వానా శాస్త్రి పురస్కారం,. 2010లో ఇండియన్ హైకూ క్లబ్ పురస్కారం, 2015లో డాక్టర్ సినారె, గురజాడ అవార్డు, 2021లో కాళోజీ అవార్డు, 2023లోశ్రీ భాష్యం విజయసారధి పురస్కారం, 2024లో తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రజాకవి, కాళోజీ పురస్కారానికి ఎంపికయ్యారు.

● బాధ్యత పెరిగింది..

- డాక్టర్ నలిమెల భాస్కర్

కాళోజీ పురస్కారానికి ఎంపిక కావడంపై 'ఆంధ్రజ్యోతి' డాక్టర్ భాస్కర్‌ను పలకరించింది. ఆయన మాట్లాడుతూ పురస్కారానికి ఎంపికవడంపై చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత కాళోజీ పేరుతో ప్రభుత్వం అవార్డు ఇస్తుండడం ఆనందదాయకమన్నారు. ఈ పురస్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందని, కాళోజీ విశ్వమానవుడని, ఆయనలో అనేక పార్శ్వాలు కనిపిస్తాయని అన్నారు. కాళోజీ కవిత్వంలో సింహభాగం తెలంగాణ కవిత్వమేనన్నారు. పౌర హక్కుల కోసం పోరాటంతోపాటు తెలంగాణ భాషకు జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక వివిధ సాహిత్య ప్రక్రియల్లో అనేక రచనలు చేశారని కొనియాడారు. 'నీ భాష నీకు ముద్దు అయితే నా భాష. యాస నాకు ముద్దు, నీ తల్లి భాష గొప్పదైతే నా తల్లి భాష కూడా గొప్పదే' అని, తెలంగాణ భాషా సరస్వతి రుణం తీర్చుకోవాలని, దీనికి ఇంకా నిర్మాణాత్మకంగా పని చేయాల్సి ఉంటుందని అన్నారు. వర్ధమాన రచయితలు అధ్యయనం చేయాలని, ఎంచుకున్న ప్రక్రియలో త్రికరణ శుద్ధిగా పని చేయాలని అన్నారు. ఇప్పటి తరానికి శక్తి సామర్థ్యాలు ఎక్కువని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో సద్వినియోగం చేసుకుంటే సాహిత్య లోకానికి మరింత మేలు జరుగుతుందని అన్నారు.

కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాలన్నదే బీజేపీ లక్ష్యం

- కాంగ్రెస్ 370 ఆర్టికల్ మళ్లీ తెచ్చే కుట్ర
- రాజకీయాలకు అతీతంగా వరద బాధితులను ఆదుకోవాలి
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్ (కరీంనగర్), సెప్టెంబరు 8: కశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలన్నదే నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా కావాలా, ఉగ్రవాద పునరుద్ధరణ కావాలా ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 370 ఆర్టికల్‌ను రద్దు చేసి కశ్మీర్‌ను అభివృద్ధి చేస్తోందన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర హోదాను ఇవ్వాలని నరేంద్రమోదీ భావిస్తున్నారన్నారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించి దేశంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని బండి సంజయ్ అన్నారు. దేశ పౌరులంతా జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని కోరుకోవడంతో పాటు ప్రతి ఒక్కరు అక్కడికి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకే ఏక్ దేశ్‌మే దో ప్రధాన్, దో విధాన్, దో నిషాన్ నహీ చలేగా అంటూ 370 ఆర్టికల్ రద్దు చేశామ న్నారు. ఉగ్రవాదులతో లింకులున్న పార్టీలతో కాంగ్రెస్ పార్టీ జతకట్టి మళ్లీ 370 ఆర్టికల్‌ను తీసుకు వచ్చి ఉగ్రవాదాన్ని పునరుద్ధరించాలని చూస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. వర్షాలతో నష్టపోయిన ప్రజలను అన్ని విధాలా ఆదు కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన వంతు సాయం చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాజకీయ విమర్శలను పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా ఉంటూ బాధితులను ఆదుకోవాలని, రాష్ట్ర ప్రజలంతా తమ వంతుగా సాయం అందించాలని బండి సంజయ్ కోరారు.

తీరని శోకం

- విద్యుదాఘాతంతో బాలుడి మృతి
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు


యశ్వంత్(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 8: వినాయక చవితి వేడుకలను సంతోషంగా జరుపుకుంటున్న ఆ కుటుంబంలో విద్యుత్ ప్రమాదం తీరని శోకం మిగిల్చింది. గ్రామంలో ఏర్పాటు చేసిన గణేశుడి మండపంలో విద్యుత్ బల్బ్ అమర్చుతుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ బాలుడు మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. హుజూరాబాద్ మండలం సిర్సపల్లి గ్రామంలో శనివారం స్నేహితులతో కలిసి గణేశ్ మండపంలో పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందాడు. పండుగ పూట ఒక్కగా నొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంగ వెంకటేష్-లావణ్య కుమారుడు యశ్వంత్(17) ఇంటర్ చదువుతున్నాడు. శనివారం వినాయక చవతి సందర్భంగా గణేశ్ మండపంలో విద్యుత్ బల్బును అమర్చుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఒక్కసారిగా యశ్వంత్ కుప్పకూలిపోయాడు. పక్కన ఉన్న తండ్రి వెంకటేష్ హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు యశ్వంత్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యశ్వంత్ మృతి తీవ్రంగా కలిచి వేసిందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీ వొడితల ప్రణవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సొల్లుబాబు తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి


మహర్షి మృతదేహం

కోరుట్ల, సెప్టెంబరు 8: కోరుట్ల పట్టణం మాదాపూర్‌కాలనీలో శనివారం జరిగిన రోడ్డు ప్రమా దంలో కాలనీకి చెందిన కారంగుల మహర్షి (5) అనే బాలుడు మృతి చెందాడు. మహర్షి కాలనీలోని తన ఇంటి నుంచి రోడ్డుమీ దికి వస్తున్న సమయంలో అదే దారిలో అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడి తలపైకి టైర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పడి వరకు మహర్షి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపి ఒక సారిగా రోడ్డు ప్రమా దంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మహర్షి తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 8: విద్యా రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం(టీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమాలోచన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ లెక్చరర్ ఫోరంలో విద్యా వ్యవస్థపై రూపొందించిన విధి విధానాల నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్‌అకాడమీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మౌలిక వసతులకు పాఠశాలలకు నిధులు కేటాయించారన్నారు. రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ ఎండీ రియాజ్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థ పటిష్టానికి చర్యలు తీసుకుంటు న్నారన్నారు. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర చైర్మన్ కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ టిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగా సమస్యలపై మేధావుల సమాలోచన అనే కార్యక్రమాన్ని జిల్లాల వారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యారంగంలో ఉన్న సమస్యలు, వాటిని అధిగమించడానికి చేపట్టాల్సిన చర్యలను జిల్లాల వారీగా క్రోడీకరించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజే యాలని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లాలోని మేధావులు, విద్యావం తులు, ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులు, టీచర్లు లెక్చరర్లు హాజరై వారి అభిప్రాయాలను తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పురమల్ల శ్రీనివాస్, టిఎల్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి రాజేశ్వర్, గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం అంజనేయులు, మాసం రత్నాకర్, రామచం ద్రారెడ్డి, సముద్రాల లింగారావు, దినేష్, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం ఎప్పుడో..?

- యేటా వర్షాకాలంలో ఇబ్బందులు
- కొట్టుకుపోతున్న కోండ్రికర్ల వాగుపై తాత్కాలిక రోడ్డు
- అవస్థలు పడుతున్న స్థానికులు


వంతెన నిర్మించాలని గ్రామస్థుల నిరసన


కోంద్రికర్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 8: ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా రహదారులు దెబ్బతిన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఎక్కడికక్కడ రహదారులు కోతకు గురయ్యాయి. దీంతో చాలా గ్రామాల్లో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొన్ని గ్రామాలకైతే సంబంధాలు కూడా తెగిపోయాయి. భారీ వర్షాలకు మండలంలోని కోంద్రికర్ల గ్రామ శివారులోని వాగుపై ప్రజలు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రోడ్డు కూడా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వాగుపై వంతెన నిర్మాణం లేకపోవడంతోనే ప్రతి సారి ఈ సమస్య ఏర్పడుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగుపై వంతెన నిర్మాణం ఎప్పుడో పూర్తవుతుందోనని గామస్థులు, ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. గ్రామం నుంచి రైతులు పొలాలకు, పక్క గ్రామాలకు, కథలాపూర్ మండలానికి వెళ్లేదారిలో ఉన్న వాగుపై నుంచి ప్రయాణించాలి. కానీ వంతెన లేక గ్రామస్థులు, ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాగు పై ప్రయాణించడానికి తాత్కాలిక రోడ్డును ప్రతి ఏటా పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసుకుంటున్నారు. వానాకాలంలో కురిసిన వర్షాలతో వాగు ప్రవహించిన సమయంలో సమస్య ఎక్కువగా ఉంటుంది. అయినా ప్రతీ వానాకాలంలో కురిసిన వర్షాలకు వరదలు ఉధృతంగా ప్రవహించడంతో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రోడ్డు కొట్టుపోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. గత స్థానిక ఎన్నికల సమయంలో గ్రామస్థుల సమస్యను పరిష్కరించాలని కోరగా వాగుపై వంతెన నిర్మాణం చేస్తానని అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు నిధులు కేటాయించి వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో బిల్లులో ఎక్కడ ఆటంకాలు ఎదురవుతాయోనని కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేందుకు రావడం లేదని సమాచారం. వంతెన ఎప్పుడు నిర్మాణమవుతుందోనని గ్రామస్థులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

● ఇబ్బందులు పరిష్కరించాలి...

గ్రామంలోని వాగుపై వంతెన నిర్మాణం ఏర్పాటు చేసి ఇబ్బందులు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. వంతెనకు అవతలి వైపున ఉన్న గ్రామాలకు, పొలాలకు రైతులు పోయేందుకు ఇబ్బందులు పడకుండా గతంలో మాజీ ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టు పొందిన వారు పనులు ప్రారంభించకుండా జాప్యం చేస్తున్నారు. మళ్లీ వర్షాకాలానికి ముందే వంతెన నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా అధికారులు దృష్టి సారించి పనులు పూర్తయ్యేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ పనులకు ముందడుగు

- నెరవేరనున్న పట్టణ ప్రజలు, భక్తుల చిరకాల వాంఛ



రాజన్న ఆలయం ఎదుట ఇరుకుగా ఉన్న ప్రధాన రోడ్డు (ఫైల్)

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 8 : వేములవాడ పట్టణ ప్రజలు, రాజన్న భక్తులకు ట్రాఫిక్ కష్టాలు దూరం కానున్నాయి. వేములవాడ మూలవాగు బ్రిడ్జి నుంచి ఆలయం వరకు రోడ్డు వెడల్పు పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో విస్తరణ పనులకు మోక్షం లభించింది. భూసేకరణ సంబంధించి నోటిఫికేషన్ శనివారం విడుదల చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధితోపాటు పట్టణ సమాగ్రాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం వేములవాడలో ట్రాఫిక్ కష్టాలు దూరం చేసేందుకు చర్యలు చేపట్టనుంది. పట్టణవాసులు, వాహనదారులు, భక్తులు తిప్పాపూర్ బస్టాండ్ నుంచి రాజన్న ఆలయం వరకు వేగంగా చేరుకునేందుకు మరికొద్ది రోజుల్లో మార్గం సుగమనం కానుంది.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 8:తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర శాఖ తెలంగాణ జిల్లాల చైతన్య యాత్ర సోమవారం జగిత్యాల జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా ఫోరం నాయకులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. పోస్టర్ ఆవిష్కరించారు. అంతకుముందు కరీంనగర్ రోడ్డులో మున్సిపల్ పార్కులో అమర వీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఉద్యమకారులకు సంబంధించి ఒక అంశం పెట్టినా కార్యాచరణ అమలులో జాప్యం జరుగుతోందన్నారు. సెప్టెంబరు 27న సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించే ఉద్యమకారుల ఆత్మీయ సన్మానానికి తరలి రావాలని పిలుపునిచ్చారు.

వైభవంగా వినాయక నవరాత్రోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, తిమ్మాపూర్, గుండారం, నారాయణపూర్, బండలింగంపల్లి, సింగారం, దుమాల, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, తదితర గ్రామాల్లో శనివారం గణనాథులు కొలువుదీరాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుమాల ఈఎంఆర్ఎస్ విద్యార్థులు అట్టలు, జనుపనార, గోధుమగింజలతో తమారు చేసిన వినాయకుడు ఆకట్టుకున్నాడు. ఎస్సై రమాకాంత్, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఎస్సై రమాకాంత్ పూజలు చేశారు. ఆయనను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.

తంగళ్లపల్లి: వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తంగళ్లపల్లి మండలం తాడూరు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక మండపాల నిర్వహకులు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐలు యాదిగిరి, మధుకర్, రమేష్, టౌన్ సీఐ కృష్ణ, ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి మండలంలో వినాయక చవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వాడవాడనా వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న ఎస్పీ, డీఎస్పీ

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వినాయక చవతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఇల్లంతకుంట: మండలంలో వినాయక చవితి వేడుకలు భక్తిప్రపత్తుల మధ్య ప్రారంభమయ్యాయి. గ్రామాలలో ఏర్పాటు చేసిన మండపాలలో వినాయకుని ప్రతిమలను శనివారం ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజులపాటు భక్తుల పూజలు అందుకునే గసణాథుల మండపాలను యువకులు అందంగా తీర్చిదిద్దారు. వంతడుపులలో ట్రాక్టర్ ట్రాలీని మండపంగా మార్చి వినాయకుని ప్రతిమను ప్రతిష్ఠించారు. మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు.



ఎల్లారెడ్డిపేటలో ఎస్సై రమాకాంత్

గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

వేములవాడ కల్చరల్: వేములవాడ పట్టణంతోపాటు ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, నాంపల్లి, తిప్పాపూర్, కొడుముంజ, చింతలఠాణ, చీర్లవంచ, మారుపాక, శాత్రాజుపల్లి, కొనాయపల్లిలో ఏర్పాటు చేసిన మండపాల్లో వినాయకుడు కొలువుదీరాడు. ఈ సందర్భంగా మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పలు మండపాల్లోని వినాయకులను దర్శించుకున్నారు.

చందుర్తి : మండలంలోని వివిధ గ్రామాల్లోని కాలనీల్లో గణపతి నవరాత్రుల సందర్భంగా గణనాథులు శనివారం కొలువుదీరారు. ఆలయాల్లో, యూత్ క్లబ్‌ల, కుల సంఘాల ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలను నిర్వహిస్తూ అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు.



రుద్రంగిలో..

రుద్రంగి: రుద్రంగి మండలంతోపాటు మానాల తండాల్లో శనివారం భక్తి శ్రద్ధలతో వినాయక చవితి నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులను పూజించాలని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మట్టి గణపతిని ఏర్పాటు చేశారు. రుద్రంగి మండల కేంద్రంలోని సర్వజన గణేష్ మండలి, హనుమన్ ఆలయం వద్ద హనుమాన్ యూత్, మున్నూరు కాపు పటేల్స్ యూత్, మహాలక్ష్మి వీధి, అంబేద్కర్ చౌరస్తా, సాయినగర్‌లో భారీ గణపతులను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 100 మట్టి గణపతులను పంపిణీ చేశారు.



దుమాలలో జనుపనారా, అట్టలతో వినాయకుడు



ఇల్లంతకుంటలో కొలువుదీరిన గణనాథుడు



గంభీరావుపేటలో..



వేములవాడలో ప్రతాప రామకృష్ణ పూజలు

బాలింత మృతి.. బంధువుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 8:వేములవాడ పట్టణానికి చెందిన బాలింత మృతి చెందడంతో ప్రభుత్వాస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే మరణించిందని ఆరోపిస్తూ బంధువులు ఆదివారం వేములవాడ ప్రాంతీయ ఏరియా ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మృతురాలి బంధువుల వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణానికి చెందిన పిల్లి రజిత(22) అనే గర్భిణిని గురువారం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అత్యవసర పరిస్థితులు ఉన్నాయని గమనించిన వైద్యులు ఆపరేషన్ నిర్వహించి మగశిశువుకు పురుడు పోశారు. శుక్రవారం తీవ్ర రక్తస్రావం కావడంతో కరీంనగర్ తరలించాలని సూచించారు. వెంటనే కరీంనగర్ తరలించగా పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమించిందని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. గాంధీ ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ శనివారం రజిత మృతి చెందింది. వేములవాడ ఏరియా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే రజిత మృతి చెందిందంటూ బంధువులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం టౌన్ సీఐ వీరప్రసాద్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని నచ్చజెప్పడంతో శాంతించారు. ఈ సంఘటనపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్యను వివరణ కోరగా అత్యవసర పరిస్థితులతోనే ఆపరేషన్ చేశామని, రక్తస్రావమవడంతో కరీంనగర్ తరలించాలని సూచించామని తెలిపారు. బిడ్డ క్షేమంగా ఉన్నాడని, తమ పొరపాటు లేదని వివరించారు.

11 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 8: పాఠశాలల మండలస్థాయి ఆటల పోటీలు ఈనెల 11న ప్రారంభం అవుతాయని ఎస్‌జీఎఫ్ చైర్మన్ బన్నాజీ, కన్వీనర్ సంపత్‌రావు సంయుక్త ప్రకటనలో తెలిపారు. గాలిపెల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో జరిగే పోటీలలో 11న బాలురకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, 12న బాలికలకు పోటీలు ఉంటాయని తెలిపారు. అండర్ 14, 17 విభాగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 8: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ప్రజలకు అవగాహన కల్పించారు. సిరిసిల్ల పట్టణంలోని 22వ వార్డు తారకరామానగర్‌లో ఆదివారం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి ఎడమల శ్రీధర్‌రెడ్డి కళాబృందం అవగాహన కల్పించింది. వార్డుకౌన్సిలర్ కల్లూరి లత మధు, తెలంగాణ సాంస్కృతిక కళాకారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్య సాధనే ధ్యేయంగా విద్యార్థి ఉద్యమాలు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 8: శాస్త్రీయ విద్య సాధనే ధ్యేయంగా విద్యార్థి ఉద్యమాలను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టిన కొనసాగించాలని జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో ఆదివారం పీడీఎస్‌యూ 50 వసంతాల పోరాట ఉద్యమ వారసత్వ సమావేశాన్ని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు అంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగిడి కుమార్ మాట్లాడుతూ భారత విప్లవ విద్యార్థి ఉద్యమ చరిత్రలో పీడీఎస్‌యూ ప్రత్యేక చరిత్ర కలిగి ఉందన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం, అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యా యన్నారు. నాయకులు రాకేష్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్లీడర్‌కు సన్మానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 8: జిల్లా ప్రధాన న్యాయస్థానం ప్రభుత్వ ప్లీడర్‌గా నియామకమైన కల్యాణచక్రవరిని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు సిరిసిల్లలోని ఆయన నివాసంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కల్యాణచక్రవర్తికి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 8: ఎల్లారెడ్డిపేట మండలం మండల కేంద్రంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వృద్ధురాలు గంగమ్మకు చెందిన ఇంటి గోడ కూలిపోయింది. గంగమ్మ ఇంటిలో ఒంటరిగా ఉంటోంది. గోడ కూలిపోవడంతో భయాందోళన చెందుతోంది. సమాచారం అందుకున్న మాజీ ఎంపీటీసీ బాలరాజు వెళ్లి పరిశీలించారు. ఆమెను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆకతాయిలపై కఠిన చర్యలు

కోనరావుపేట, సెప్టెంబరు 8 : ఆకతాయి చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కోనరావుపేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో ద్విచక్ర వాహన సైలెన్సర్ మోడిఫై చేయడంతో సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.

పాడి గేదెపై పిచ్చికుక్క దాడి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు ముద్దం వెంకటికి చెందిన పాడిగేదెపై ఆదివారం పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. రైతు వెంకటి తన పాడి గేదెను పశువుల పాకలో కట్టేశాడు. పిచ్చికుక్క దాడి చేసింది. తీవ్ర గాయాలపాలవడంతో స్థానిక పశు వైద్యాధికారి రేణుకకు సమాచారం అందించారు. పాడి గేదెకు చికిత్స అందించారు. అంతకుముందు స్థానికులు కలిసి పిచ్చికుక్కను చంపేశారు.

నేతన్నలకు ఉపాధి కల్పించాలి



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 8: సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించాలని, కుటుంబ పోషణ కోసం తక్షణమే రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్ జెండా చౌరస్తాతో పాటు చంద్రంపేట చౌరస్తాలో ఆదివారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మరమగ్గాల పరిశ్రమ కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరమగ్గాల పరిశ్రమతోపాటు అనుబంధ రంగాల పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు తొమ్మిది నెలలుగా ఉపాధి లేకుండా పోయిందని, సీఎం స్పందించి వారికి ఉపాధి కల్పించడంతోపాటు సిరిసిల్లలో ఏర్పాటు చేసిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని ప్రారంభించాలని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్ నాంపల్లిలో జరిగే చేనేత సమావేశంలో కార్మికుల నుంచి సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రాలను అందించి సిరిసిల్లలో నెలకొన్న సంక్షోభంతో పాటు ఉపాధిలేక నేతన్నల ఆత్మహత్యలపై సీఎంకు వివరించనున్నట్లు తెలిపారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మీద కోపంతో వస్త్ర పరిశ్రమను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, ఆగస్టు 15 తరువాత వస్త్ర పరిశ్రమ సంక్షోభం నివారణ కోసం సమీక్షలు నిర్వహిస్తామని సీఎం ప్రకటించారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు స్పందించాలని, సంక్షోభ పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నేతన్నలకు ఉపాధి కల్పించే విధంగా సీఎంను ఒప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రంపేట యూనియన్ అధ్యక్షుడు గుల్లు రమేష్, వైపని అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, వార్పిన్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నక్కదేవదాస్, జిల్లా నాయకులు ఒగ్గు గణేష్, ఎక్కల్‌దేవి జగదీష్, బెజుగం సురేష్, కందుకూరి రమేష్, స్వర్గం శేఖర్, అజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో అవార్డు అందుకోవాలి



శంకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న అది శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 8: విద్యార్థులకు సైన్స్‌లో యంత్రాల తయారీపై అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ అందించి వారిని ఇన్‌స్పైర్‌లుగా తీర్చిదిద్ది జాతీయ స్థాయిలో అవార్డులను అందుకు నేందుకు ఉపాధ్యాయులు పోటీ పడాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. సిరిసిల్లలో ఆదివారం పట్టణంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు పాకాల శంకర్‌గౌడ్ ఇటీవల రాష్ట్ర స్థాయి అవార్డును అందుకోవడంతో ఆయనను సన్మానించారు. టీఎస్‌యూటీఎఫ్ చందుర్తి బాధ్యులు మొగిలి శంకర్ పాల్గొన్నారు.

లింగన్నపేట ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ

గంభీరావుపేట, సెప్టెంబరు 8: గంభీరావుపేట మండలం లింగన్నపేట ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా చెరిపల్లి శ్రీనివాస్, కో కన్వీనర్లుగా అంబటి రవి, తంగళ్లపల్లి రాజు, అంబటి సురేందర్, చెరిపల్లి శ్రీనివాస్, మిద్దె రాజు, చింతల నర్సింలు, అంబటి ఎల్లయ్య, చింతల శేఖర్, అంబటి లక్ష్మణ్, తంగళ్లపల్లి ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల బాధ్యులు మల్యాల రాజవీర్, ఎగదండి స్వామి, ఎడబోయిన రాజు, బండ రమేష్ ఉన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

కోనరావుపేట, సెప్టెంబరు 8 : క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు కచ్చకాయల మహేష్ అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాలలో గ్రామస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు డి.సంజీవ్, బి.రమేష్ గౌడ్, వంగాల జగదీష్, పోరడు ప్రశాంత్, డి.ప్రవీణ్ కుమార్, మహేష్, అరుణ్, దిలీప్, సందీప్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రుద్రంగి, సెప్టెంబరు 8: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీప్రసన్న అన్నారు. విష జ్వరాలు విజృంభించడంతో రుద్రంగి మండల కేంద్రంలో ఆదివారం రెండు ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో రెడ్డి సంఘం వద్ద, ప్రభుత్వ పాఠశాల సమీపంలోని కాలనీలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సూమారు 55 మంది రక్త పరీక్షలు నిర్వహించారు. పలువురికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న కాసు మాధవి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 8: ఆశావర్కర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరిచంఆలని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సీఐటీయూ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ఆదివారం తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లకు జిల్లా స్థాయి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఇందులో ఆశావర్కర్లకు భారత కార్మిక ఉద్యమ చరిత్రపై సీఐటీయూ విశిష్టత అనే అంశంపై సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, పరిష్కారాలు అనే అంశంపై ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి తరగతులు బోధించారు. ఈ సందర్భంగా దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హింసలను అరికట్టాలని ప్రధానమంత్రికి అందించే వినతిపత్రంలో ఆశా వర్కర్లతో సంతకాల కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో అమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అశా వర్కర్లను పర్మినెంట్ చేయాలని, వారికి కనీస వేతనం రూ.26 వేలు అందించాలని అన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షురావలు బాదవేని మంజుల, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, సూరం పద్మ, జయశీల, భారతి, కస్తూరి, గాయత్రి, రుచిత, గీత, చంద్రకళ, లత, భూలక్ష్మి, జమున తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి నవ సమాజ నిర్మాణానికి పోపా దిక్సూచి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 8: పద్మశాలీ నవ సమాజ నిర్మాణానికి పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) దిక్సూచిగా నిలుస్తుందని రాష్ట్ర ఉపాధ్యాక్షుడు గడ్డం శ్రీరాములు అన్నారు. సిరిసిల్లలో అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పద్మశాలీ కల్యాణ మండపంలో పాలిటెక్నిక్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనిటీ హెల్త్ క్యాంపులు నిర్వహించిన పద్మశాలీ టీచర్స్, డాక్టర్స్, ఆర్గనైజర్లుకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ సిరిసిల్లలో పోపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల పున్నంచందర్ మాట్లాడుతూ ప్రతిభ గల పద్మశాలీ కులానికి చెందిన విద్యార్థుల ఉన్నత చదువులకు పోపా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఉపాధ్యక్షుడు మామిడాల భూపతి మాట్లాడుతూ పద్మశాలి సమాజ హితం కోసం వేసవి సెలవులను సైతం త్యాగం చేసి పాలిటెక్నిక్, స్పోకెన్ ఇంగ్లీష్, హెల్త్‌క్యాంపులను నిర్వహించడం గర్వకారణమన్నారు. ఎంఈవో దూస రఘుపతి, పోపా ప్రతినిధులు గాజుల ప్రతాప్, మచ్చ అనంద్, ప్రొఫెసర్ ఆడెపు శ్రీనివాస్, గెంట్యాల భూమేష్, వాసాల హరిప్రసాద్, బొల్లి భగవాన్, కనుకుంట్ల మధు, అడెపు వేణు, ఆడెపు చక్రపాణి, అంకారపు జ్ఞానోబా, కొక్కుల శ్రీనివాస్, డాక్టర్ తడుక సాయికుమార్, డాక్టర్ తడుక రవళి, డాక్టర్ సుమంత్, బైరి రవీందర్, చేరాల తిరుపతి, ప్రభాకర్, బూర శ్రీనివాస్, సదానందం, చిట్యాల రత్నాకర్, రమాదేవి, కనుకుంట్ల తిరుమల, గుండెల్లి కీర్తి, కోడం పూర్ణిమ, నాగుల శ్రీనివాస్, గడ్డం సత్యనారాయణ, జక్కని నవీన్, గుండెల్లి రవీందర్, గాజెంగి తుకారాం, అలువాల ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు





పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 8: పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను ఆదివారం హైదరాబాద్‌లో సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగుల సత్య నారాయణగౌడ్, నాయకులు కలిసి పుష్ప గుచ్ఛాలు అందించి సన్మా నించారు.

ముస్తాబాద్: పీసీసీ అధ్యక్షుడిగా నియమకమైన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

తంగళ్లపల్లి : పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో కాంగ్రెస్ మండల నాయకుడు సత్తు శ్రీనివాస్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా నాయకుడు కణిమేని చక్రధర్‌రెడ్డి ఉన్నారు.

బ్రిడ్జి కూల్చారు.. నిర్మాణం మరిచారు



పాత లో లెవల్ బ్రిడ్జి (ఫైల్)

- గంభీరావుపేట-లింగన్నపేట వంతెన నిర్మాణంలో ఇష్టారాజ్యం
- మానేరు ఉధృతికి కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
- అవస్థలు పడుతున్న ప్రజలు

గంభీరావుపేట, సెప్టెంబరు 8: గంభీరావుపేట - లింగన్నపేట మధ్య మానేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి పనుల జాప్యంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మానేరు వాగుపై లో లెవెల్ బ్రిడ్జి ఉండడంతో మానేరు మత్తడి దూకిన సమయంలో ఈ మార్గం గుండా వాహనాల రాకపోకలు నిలిచిపోయేవి. ఈ ప్రాంత ప్రజల విన్నపాల మేరకు హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం గతంలోనే నిధులు మంజూరు చేశారు. లో లెవెల్ బ్రిడ్జి ఉండగానే హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని ఈ ప్రాంత ప్రజల ప్రధాన డిమాండ్ ఉన్నప్పటికీ సదరు కాంట్రాక్టర్ ముందు చూపు లేకుండా లో లెవల్ బ్రిడ్జిని కూల్చేశారు. వాహనాల రాకపోకల కోసం పక్కనే తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. హై లెవెల్ బ్రిడ్జి పనులు పిల్లర్ దశలోనే ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు ఎగువ మానేరు నిండి ఉప్పొంగడంతో మానేరు వాగు పొంగిపొర్లింది. దీంతో తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు కొట్టుకపోయింది. ఈ మార్గం గుండా ఇప్పట్లో వాహనాలు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. ఏటా మానేరు మత్తడి దూకిన సమయంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మళ్లీ తిరిగి వాగు ఉధృతి తగ్గగానే లో లెవెల్ బ్రిడ్జి మీద వాహనాలు యథావిధిగా నడిచేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. సిద్దిపేట - కామారెడ్డి ప్రధాన మార్గం ఇదే కావడంతో రెండు జిల్లాల ప్రజలు వేరే మార్గాలను వెతుక్కుంటూ దూర భారంతో అవస్థలు పడుతున్నారు. వాగు ఉధృతి తగ్గిన వెంటనే వాహనాల రాకపోకలు కొనసాగే విధంగా కొత్త బ్రిడ్జి నిర్మించే వరకైనా తాత్కాలిక రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.



మానేరు వాగుపై బ్రిడ్జి దుస్థితి